# 3

# అదుపు చేయబడిన శక్తి

## (మత్తయి 5:5)

మీరు అవమానంగా, చిరాకుగా, త్వరగా కోపపడుతూ ఉంటారా? అయితే అత్యధిక ఆనందమును పొందుటకు ప్రభువు ఇస్తున్న మూడవ ధన్యతను ఒకసారి గమనించండి. "సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" (మత్తయి 5:5). అనేకమందికి KJVలో చెప్పబడిన మాటలు తెలుసు. "సాధుస్వభావులు ధన్యులు: వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."[1]

సాత్వికులై, సాదు స్వభావులైయుండడానికి ఈ లోకం అంతగా విలువ ఇవ్వదు. ఇదే ధన్యతను లోకపరంగా ఇలా మారుస్తారు: "పొగరుగా ఉండేవారు ధన్యులు. వారు అన్నిచోట్ల రాణిస్తారు"; "తమ గురించి తాము ఉప్పొంగేవారు ధన్యులు వారు ప్రతిచోట గుర్తింపునొందుతారు"; "దూకుడు స్వభావం గలవారు ధన్యులు వారి మాటే అన్ని చోట్ల చెల్లుతుంది." అయితే దీనికి వ్యతిరేకంగా, "సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" అని ప్రభువు చెప్తున్నారు.

"వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" – అన్న మాట ఎన్నో ఊహలను, అంతకంటే ఎక్కువగా వివాదాలను రేకెత్తిస్తుంది. సాత్వికులు, సాధుస్వభావులు ఈ లోకమును స్వతంత్రించుకొంటారు అని ప్రభువు చెప్పడంలో ఆయన ఉద్దేశం ఏమిటి? అలాగే సాత్వికులు ఏవిధంగా ధన్యులు? ప్రశ్నలకు గల సమాధానాన్ని ఈ పాఠములో చూద్దాము.

### "సాత్వికులు ధన్యులు ..."

**వివరణ**

మొదటిగా NASB తర్జుమాలో ఇవ్వబడిన "సాత్వికులు" KJVలో తర్జుమాలో ఇవ్వబడిన "సాధు స్వభావులు" అన్న పదమునకు బైబిలు ఇస్తున్న అర్థాన్ని చూద్దాము. ఈ పాఠముల క్రమములో ఇవ్వబడిన విధంగా గాక, మొదటిగా దీని సానుకూల (సకారాత్మక) అర్థాన్ని తరువాత దీని ప్రతికూల (నకారాత్మక) అర్థాన్ని చూద్దాము. మొదటిగా దీని గ్రీకు పదం యొక్క అర్థాన్ని చూద్దాము. తరువాత ఇది ఏమని అర్థమివ్వడం లేదన్న విషయాన్ని గమనించుదాము.

*సాత్వికం/సాధుస్వభావం అంటే ఏమిటి?* "సాత్వికం" అనే పదము *praus* అనే గ్రీకు పదమునుండి తర్జుమా చేయబడింది. దీనికి (*praus*) "సాత్వికం, మృదుత్వం, సాధుత్వం"[2] అని Joseph Henry Thayer నిఘంటువు అర్థానిస్తుంది. "ప్రాస్" అనేది "పిచ్చి కోపము" మరియు "ఏమి చేయలేని అశక్తత"కు మధ్య మార్గం అని, ఇది "ఆగ్రహం" మరియు "ఉదాసీనతకు సమన్వయ ప్రాంతం" అని గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ (క్రీ.పూ. 384–322) తెలియజేశాడు.[3] Hugo McCord యిలా వ్రాస్తున్నాడు,

> జంతువుల విషయంలో [*praus*] అన్న పదాన్ని ఉపయోగించవలసినప్పుడు గ్రీకులు మచ్చిక చేయబడిన అడవి జంతువులను సూచించుటకు ఉపయోగించారు. శబ్దము విషయములో దీనిని మధుర, మృదువు అన్న అర్థంలో వాడేవారు. మనుష్యుల విషయంలో సాధుస్వభావం, సాత్వికులు అన్న అర్థంలో వాడేవారు.[4]

సాత్వికము యొక్క అవసరతను గుర్తిస్తూ "ప్రాస్"ను (*praus*) గురించిన చర్చను మొదలు పెడతాము. క్రైస్తవులు "జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, *సాత్వికమును*, దీర్ఘశాంతమును ధరించుకోవాలి" (కొలొస్సయులకు 3:12; నొక్కి చెప్పింది నాది). నశించుచున్నవారికి సువార్తను చెప్పి వారికి రక్షించుటకు మనం "సాత్వికము గల మనస్సు" గలవారమైయుండాలి (గలతీయులకు 6:1; 2 తిమోతి 2:25; 1 పేతురు 3:15ను చూడు). ప్రాస్ (*praus*) అను పదము "సాత్వికముగా" అనువదించబడింది. అమెరికాలో తన అసలు అర్థాన్ని పోగొట్టుకొన్న పదంగా వాడబడింది: "సజ్జనుడు" అన్న అర్థంతో వాడుతున్నారు. కానీ ఒకప్పుడు ఇతరులతో సాత్వికముగా వ్యవహరించే వ్యక్తిని సూచించుటకు ఈ పదాన్ని వాడేవారు. మనమందరము సాధు పురుషులము (జంటిల్‌మ్యాన్),[5] సాధు స్త్రీలమైయుండాలని వాక్యం బోధిస్తుంది.

*Praus* అర్థాన్ని వెదుకుటలో సాత్వికం మొదటి విషయమేగాని, చివరి విషయం కాదు. పాత నిబంధనలో మెస్సీయాని గురించి ఈ ప్రవచనం ఇయ్యబడింది:

> సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి; యెరూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడి. నీ రాజు నీతిపరుడును రక్షణగలవాడును *దీనుడునై*, గాడిదను గాడిద పిల్లను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడు (జెకర్యా 9:9; నొక్కి చెప్పింది నాది).

యేసు ప్రభువు యెరూషలేమునకు జయోత్సాహముగా వచ్చినప్పుడు ఈ వాక్యం నెరవేరింది. మత్తయి తన సువార్తలో ఇదే వాక్యభాగాన్ని ప్రస్తావించాడు. అయితే "దీనుడు" అన్న మాటకు బదులు అతడు ఏమి ఉపయోగించాడో చూడండి:

> "ఇదిగో నీ రాజు *సాత్వికుడై* (ప్రాస్ అన్న పద రూపం), గాడిదను భారవాహక పశువు పిల్లయైన చిన్న గాడిదను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి" (మత్తయి 21:5; నొక్కి చెప్పింది నాది).

జకర్యా "దీనుడు" అన్న పదాన్ని ఉపయోగించగా, మత్తయి "సాత్వికుడు" అన్న పదాన్ని ఉపయోగించాడు. సాదు స్వభావం/సాత్వికముతో దీనత్వం కనబడుతుంది. యాకోబు 1:21 వాక్య భాగంలోని *praus* అనే పదాన్ని NASB "దీనత్వము"గా అనువదిస్తుంది: "మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును మీలో నాటబడునట్లు దీనత్వముతో అంగీకరించండి." "దీన మనస్సు కలిగియున్నప్పుడే మనం సాత్వికము కలిగియుండగలం"[6] అని W. E. Vine తెలియజేస్తున్నాడు. జెకర్యా 9:9లో "దీనత్వం" అను పదమునకు KJVలో "తగ్గింపు" అని ఇవ్వబడింది. దీన్నిబట్టి McCord సాత్వికమును "తగ్గింపు స్వభావం కలిగి సాధువైయుండడం" అని నిర్వచించాడు.[7]

ప్రభువు తన మనసులో సాత్వికము, దీనత్వం యొక్క గుణాలను ఉంచుకొని *praus* గురించి చెప్తున్నారు. కానీ దీని గురించిన పూర్తి అవగాహన మనమింకను పొందలేదు. అలాగే, *praus* అన్న పదానికి ఆమోదయోగ్యమైన, ఫిర్యాదు, లొంగిపోవడం వంటి అర్థాలు కూడ

ఉన్నాయి. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తి దేవునికి విధేయుడై జీవిస్తాడు. వైన్ యిలా వ్రాస్తున్నాడు,

> (*Praus* యొక్క భావములు) ప్రధానంగా దేవునివైపు మన వైఖరిని చూపిస్తున్నాయి. మన యెడల ఆయన క్రియలను మంచివిగాను వాటిని మనం వ్యతిరేకించకుండగాను ఉంటే మన ఆత్మ పరిస్థితిని ఇది సూచిస్తుంది. ఇది దేవునికి వ్యతిరేకంగా పోరాడదు గాని ఆయనతో విభేదించదు.[8]

"[మత్తయి] 5:5లో భూలోకమును స్వతంత్రించుకుంటారని వాగ్దానం చేయబడిన వారు దేవుని చిత్తాన్ని గుర్తించువారు" అని ఒక గ్రీకు నిఘంటువు తెలియజేస్తుంది.[9]

ఈ అధ్యయనంలో, ధన్యతల వరుస క్రమాన్ని మనం చూస్తున్నాము. ఒక వ్యక్తి తాను ఏమీలేని వాడనని, దేవుడే తనకు సర్వస్వమని (మొదటి ధన్యతగా) భావిస్తాడు. తన ఆత్మీయ పరిస్థితి గురించి అతడు దుఃఖపడి (రెండవ ధన్యత) పశ్చాతాపపడి దేవుని వైపు తిరుగుతాడు. ఆత్మ విషయమైన దీనత్వం, దుఃఖము అతడిలో సాధుత్వాన్ని, సాత్వికమును ఇస్తాయి (మూడవ ధన్యత), ఇందునుబట్టి అతడు ఏమియు ప్రశ్నించకుండా దేవుని చిత్తానికి లొంగిపోలేడు.

దేవునియందలి విధేయ స్వభావాన్ని కలిగియుండడం ద్వారా ఇతరులతో మన సంబంధాలు కూడా మెరుగుపడతాయి. "మనుష్యులందరి యెడల సంపూర్ణమైన *సాత్వికమును* కనపరచుచు ... శాంతులైయుండవలెనని" క్రైస్తవులకు విజ్ఞప్తిచేయవలెనని పౌలు తీతుకు వ్రాస్తున్నాడు (తీతు 3:1, 2; నొక్కి చెప్పింది నాది). సాత్వికుడైన క్రైస్తవుడు తన దారి తనదే అని ఎన్నడూ అనుకోడు. యితరుల భావములు, అవసరతలను ఎరిగి అతడు మెలుగుతాడు.

అయితే మత్తయి 5:5లోని సాత్వికమును మనం ఎలా నిర్వచించగలం? దేవుని చిత్తానికి లోబడియుండి. యితరులతో సున్నితంగా వ్యవహరించు మనస్సు ఇది.

*"సాత్వికం" అంటే ఏమి కాదు.* *Praus* అంటే ఏమిటో చర్చించిన మీదట, *praus* అంటే ఏమి కాదన్న విషయం పై కొన్ని ముక్తాయింపులకు వచ్చాయి. మొదటిగా, *praus* అనేది బలహీనమైన లక్షణం కాదన్న విషయాన్ని గుర్తించాలి. చాలా సంవత్సరాల క్రితం, ఎక్కువమంది ప్రజలకు కేవలం KJV బైబిలు మాత్రమే అందుబాటులోనున్నప్పుడు "సాత్వికం" అన్న పదానికి ఎంతోమంది గందరగోళం చెందేవారు. వారి దృష్టిలో సాత్వికం అంటే, ఒక వ్యక్తి భయంతో నిస్సహాయుడైన బెరకుగా నిలిచి ఉంటే మిగిలిన వారు దాన్ని అలుసుగా తీసుకుని ఆ వ్యక్తిని హేళన చేసి, హింసించడం అని భావము. అయితే క్రొత్తగా వచ్చిన NASB వంటి తర్జుమాలు "సాధుత్వం" వంటి పదాలను ఉపయోగించాయి. కానీ ఇప్పటికి సాత్వికుడు అంటే బలమైన వ్యక్తికి వ్యతిరేక అర్థంలో దీనిని వాడుతుంటారు.

సాధు జంతువులకు సంబంధించి గ్రీకులు *praus* అనే మాటను వాడేవారని గుర్తుంచుకోండి. *సాధు* జంతువులను సాధు చేయడమంటే, అడవి గుఱ్ఱములను స్వారీ చేయుటకు ఆధీనములో పెట్టుకోవడమే గుర్తుకు వస్తుంది. ఒక గుఱ్ఱం స్వారీ చేయడం కోసం *అధీనములోకి* తేబడినా గాని దాని శక్తి నాశనం కాదు. అంతేగాని దాని శక్తి స్వాధీనంలోకి వస్తుంది. మత్తయి 5:5లోని సాత్వికమును "అదుపు చేయబడిన బలముగా"[10] చెప్పవచ్చు. దేవునితో మన సంబంధ విషయములో "గౌరవము చేత అదుపు చేయబడిన బలముగా" *praus*ను చెప్పవచ్చు.

రెండవదిగా, ప్రతి విషయాన్ని, ప్రతి సందర్భాన్ని ఆఖరకు అనైతికం, అసభ్యకరం

అయిన వాటిని కూడా సహించే మనస్సు *praus* కాదు. కొంతమంది తాము ఎవరితోనూ తగాదాగా ఉండమని కాబట్టి తాము సాత్వికులమని భావిస్తుంటారు. వారు అట్టివాటినుండి తప్పించుకొనుటకు ఎంత పని అయినా చేస్తారు. మత్తయి 5:5లో చెప్పబడిన సాత్వికములో సమాధానమును కలిగియుండడం తప్పుకాదు గాని (9 వచనాన్ని చూడు), అతనిలో చెడు ఉండడం తప్పే. తప్పునుండి తప్పుకోకపోవడం సాత్వికము కాదు. D. Martyn Lloyd-Jones ప్రకారం, ఇది "మెతకతనం."[11]

మూడవదిగా, *praus* అనేది మనసు యొక్క 'సహజ" గుణం కాదు. సాత్వికపు లక్షణాలను కొంతమంది కలిగియుండడం నిజమే. యిటువంటి వారిని "నెమ్మదిపరులు" అంటారు *Praus* అనే పదాన్ని ప్రభువు వాడినప్పుడు ఆయన మనసులో ఈ అభిప్రాయం లేదు. ప్రతి క్రైస్తవుడు సహజంగా దీనిని కలిగియున్నా లేకున్నా, దీనిని పొందాలని ప్రభువు సూచిస్తున్నారు. దీన్ని పొందాలంటే మనకు దైవిక సహాయం అవసరం. గలతీయులకు 5:22. 23లో పౌలు "ఆత్మ ఫలముల" గురించి మాట్లాడుతున్నాడు. ఫలముల జాబితాలో పౌలు "సాత్వికమును" (23 వచనం) కూడా చేర్చాడు. మనం దేవునికి లోబడి, పరిశుద్ధాత్ముని క్రియలను మనలో జరుగనిచ్చినప్పుడు మాత్రమే మనం సాత్వికులమవుతాము.

### ఉదాహరణలు

*Praus* అనే పదం కొంత సంక్లిష్టంగా మీకనిపించవచ్చు. దీనిని అర్థం చేసుకొని మనం బైబిలులోని ఉదాహరణలను గమనించుదాము. వాక్యంలో మనకు అనేక ఉదాహరణలు కనబడుతాయి[12] కాని, మనం రెండింటిని చూద్దాము. ఒకటి పాత నిబంధనలో, మరొకటి క్రొత్త నిబంధన నుండి.[13]

పాత నిబంధనలోని సంఖ్యాకాండము 12:3లో "మోషే భూమి మీదనున్న వారందిరిలో మిక్కిలి సాత్వికుడు" అని చూస్తాము. "భూమి మీదనుండే మనుష్యులందరి కంటెను మోషే ఎంతో సాత్వికుడు" అని KJVలో ఉంది. మోషేను వివరించడానికి పాత నిబంధన గ్రీకు తర్జుమాలో *praus* అనే పదం వాడబడింది.

మోషే గురించి మీకు ఏం తెలుసో ఆలోచించండి. అప్పటికి అతడే మిక్కిలి సాత్వికుడు అయితే అతడు బలహీనుడా? ఒక బలహీనుడయిన వ్యక్తి ఇరవై లక్షల మందిని ఐగుప్తునుండి నడిపించగలడా? మోషే సాత్వికుడే కానీ, కొన్ని సందర్భాల్లో అతని ఆగ్రహావేశాలను మనం చూడగలం.[14] సాత్వికం అనేది అతడి *సహజ* లక్షణం అయి ఉంటుందని నేను భావిస్తున్నాను. అలాకాక, మనం చర్చించిన గుణాలన్నీ అతడిలోనున్నాయి. దేవుని ఆత్మకు తన ఆత్మను అతడు అప్పగించుకున్నాడు. దాని ద్వారా యితరులతో ఎలా మెలగాలో అతడు నేర్చుకున్నాడు. దేవుని పట్ల అవిధేయతను కనబరుస్తున్నప్పుడు అతడు సాత్వికముగా ఉండలేదు. అయినా అటువంటి సమయంలోనూ దీనత్వమును అతడు కనబరిచాడు.

మోషే జీవితంనుండి రెండు ఉదాహరణలు సరిపోతాయనుకుంటున్నాను. ఒక యౌవ్వనుడు మోషే దగ్గరకు పరుగెత్తుకు వచ్చి ఇద్దరు మనుష్యులు పాళెములో ప్రవచించుచున్నారని చెప్పడం 11వ అధ్యాయములో చూస్తాము (26, 27 వచనాలు). "వాళ్ళకెవడు ఆ అధికారం ఇచ్చాడు?" అని గర్వం కలిగిన నాయకుడు అనేవాడు. "మోషే, నా ప్రభువా, వారిని నిషేధింపుము" అని యెహోషువా అన్నాడు (28 వచనం). అందుకు

మోషే – "నా నిమిత్తము నీకు రోషము వచ్చెనా? యెహోవా ప్రజలందరును ప్రవక్తలగునట్లు యెహోవా తన ఆత్మను వారిమీద ఉంచునుగాక" అని అన్నాడు (29 వచనం).

పన్నెండవ అధ్యాయములో (మోషే సాత్వికమును గురించి పేర్కొనబడిన అధ్యాయం) మిర్యాము, అహోరనులు తన సోదరుడి గురించి కఠినముగా మాట్లాడుతారు (1, 2 వచనాలు). దేవుడే వారిద్దరిని ఖండించాడు (4–9 వచనాలు). ఈ విమర్శకు కారణమయిన మిర్యామును[15] ఆయన శిక్షించాడు (10 వచనం). నేనా మోషేనయితే, "ఆమెకు తగిన శాస్తి జరిగింది" అని అనేవాడినేమో! అలాగాక అతడు తన సోదరి గురించి ప్రార్థించాడు. "దేవా దయచేసి ఈమెను బాగుచేయుమని" ప్రార్థించాడు (13 వచనం). మోషే ఎంత గొప్ప నాయకుడు.

క్రొత్త నిబంధనలో చూస్తే, సాత్వికమునకు తిరుగులేని మాదిరియైన యేసు క్రీసును ఉదాహరణగా చూస్తాము. మనం యింతకు ముందు చూసిన మత్తయి 21:5ను చూడండి, ఇది మెస్సీయాను *praus*గా చూపిస్తుంది. యేసుక్రీస్తు యొక్క సాత్వికమును (*praus*) మృదుత్వమును బట్టి మిమ్మును వేడుకొనుచున్నాను అని పౌలు 2 కొరింథీయులకు 10:1లో వ్రాస్తున్నాడు. "నేను సాత్వికుడును, దీని మస్సుగలవాడును" (మత్తయి 11:29) అని ప్రభువు తన గురించి తానే చెప్పారు. యేసు బలహీనుడా? దేవాలయములో మారకం చేస్తున్న వారిని ప్రభువు చెదరగొట్టిన సంఘటనను జ్ఞాపకం చేసుకోండి (యోహాను 2:13–17). ప్రభువు దుష్టత్వమును సహించలేరా? మత్తయి 23లో ఆయన పరిసయ్యులను ఖండించిన విధాన్ని జ్ఞాపకం చేసుకోండి.

అయితే ప్రభువు ఎందుకు "సాత్వికుడుగా" పిలువబడ్డారు? ఆయన తన తండ్రి చిత్తానికి సంపూర్ణంగా లోబడ్డారు (యోహాను 6:38; మత్తయి 26:39ను చూడు). ఆయన దైవిక హక్కులు, సర్వమును విడిచి తనను తాను రిక్తునిగా చేసుకుని దేవునికి మనుష్యులకు పరిచారకుడయ్యాడు (ఫిలిప్పీయులకు 2:5–8). ఆయన తనకంటే ఎక్కువగా యితరుల గురించి ఆలోచించాడు (మత్తయి 20:28ను చూడు). నశించుచున్న వారి యెడల సాత్వికముతో ఆయన వ్యవహరించాడు. ఆయన "పాపుల స్నేహితుడుగా" పిలువబడ్డాడు (మత్తయి 11:19).

ప్రభుని సాత్వికమునకు చక్కని ఉదాహరణ యోహాను 8:1–11లో కనబడుతుంది.[16] ప్రభువును ఇరుకున పెట్టు ఉద్దేశముతో శాస్త్రులు, పరిసయ్యుల వ్యభిచారంలో పట్టబడిన స్త్రీని ప్రభువు యొద్దకు తీసుకువచ్చారు.[17] ఆయన వారి పన్నాగమును గుర్తించి, ఆరోపించిన వారు వెళ్ళిపోయిన తరువాత ఆయన "ఎవరును నీకు శిక్ష విధింపలేదా?" అని ఆమెను అడుగగా ఆమె లేదు ప్రభువా అనెను. అందుకు యేసు "సాత్వికముతో" నేనును నీకు శిక్ష విధింపను. "నీవు వెళ్ళి ఇక పాపము చేయకుమని" ఆమెతో అన్నారు (10, 11 వచనాలు). ప్రభువు శక్తిమంతుడే కాని ఆయన శక్తి తన స్వాధీనములోనే యున్నది. దేవుని యెడల గౌరవము చేత ప్రజల పట్ల ప్రేమచేత అది అదుపు చేయబడింది. అదే మత్తయి 5:5లోని సాత్వికము అంటే!

### "... వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."

ఈ లక్షణమును కలిగియున్నవారు "ధన్యులు" అని ప్రభువు చెప్తున్నారు. వారికి అత్యానందమున్నది. సాత్వికమునకు సంతోషమునకు సంబంధమేమిటి? మునుపటి

ధన్యతలవలె ఈ లక్షణం కలిగియుండడమే మహా సంతోషం కలుగుతుంది. ఎందుకంటే, సాత్వికమైన వ్యక్తి తన స్వంత అవసరతల కంటే యితరుల అవసరతల గురించే ఎక్కువ ఆలోచిస్తాడు. కాబట్టి, ఈ లోకంలోని వారివలెగాక, యితరుల అవసరతల విషయంలో అతడు అసంతృప్తి కలిగియుండలేడు. వాగ్దానపు ఫలితమైన సంతోషం మీదనే మన వాక్య భాగం నొక్కి చెప్తుంది.

మత్తయి 5:5లో అద్భుతమైన వాగ్దానం ఇయ్యబడింది: "సాత్వికులు ధన్యులు *వారు భూలోకమును స్వతంత్రించుకొందురు*" దీని అర్థం ఏమిటి? ఏ విధంగా "సాత్వికులు భూలోకమును స్వతంత్రించుకొంటారు?"

**ఈ వాగ్దానపు అర్థం *ఏది* కాదు**

సాత్విక మనస్సుగలవారు న్యాయపరంగా ఈ లోకమును స్వతంత్రించుకుంటారని వాగ్దానం చేయబడ*లేదు*. మనం చర్చించిన సాత్వికమును గురించిన రెండు ఉదాహరణలను గమనించండి: మోషే మరియు యేసు ప్రభువుని గురించి ఆలోచించండి. McCord ఈ విధంగా వ్రాస్తున్నాడు,

> యేసు ప్రభువు మనకు వాగ్దానం చేసిన లోకము అక్షరార్థముగా ప్రస్తుత ఈ భూలోకమని ఎవరైనా నమ్ముతున్నట్టయితే, లోకంలోనే మిక్కిలి సాత్వికుడుగా పిలువబడిన మోషే వాగ్దాన దేశమును పొందలేకపోయాడు. మోషే ఇల్లులేక నలభైయేళ్ళు తిరిగాడు. వాగ్దాన దేశమును చూస్తాననే నమ్మకంతో ఉన్నాగాని, దానిని దూరంనుండి మాత్రమే చూడగలిగాడు [ద్వితీయోపదేశకాండము 34:1-5]. సాత్వికునిగా చెప్పబడిన యేసుక్రీస్తు కూడ ఈ లోకమును అక్షరార్థముగా స్వతంత్రించుకొనలేదు. "నక్కలకు బొరియలును ఆకాశ పక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారుడు తలవాల్చుకొనుటకైనను స్థలము లేదు" [లూకా 9:58; KJV చూడు] అని ఆయన చెప్పారు.[18]

అలాగాక, ఒకానొక రోజున క్రైస్తవులు ఈ భూమిని న్యాయపరంగా స్వతంత్రించుకుంటారని నమ్ముతూ నాకు వ్రాసిన లేఖలు, కొన్ని వ్యాసాలు నా దగ్గరున్నాయి. వారుపయోగించిన వాక్యభాగం మత్తయి 5:5: "సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురు." ఉదాహరణకు వెయ్యి ఏళ్ళ పరిపాలన ముందే జరుగుతుందని భావించేవారు ఈ వాగ్దానం అంత్య కాలములో నెరవేరుతుందని నమ్ముతారు. ప్రభువు తిరిగి వచ్చి వెయ్యేళ్ళు ఈ లోకాన్ని పరిపాలిస్తాడని వారు చెబుతారు. ఆ సమయంలో దేవుని పిల్లలు ఈ లోకాన్ని స్వతంత్రించుకుంటారని వారు చెబుతారు.

దేవుని పిల్లలు ఈ లోకంలో శాశ్వతంగా జీవించుచుండగా, 144,000 మంది పరలోకంలో ఉంటారని కొంతమంది చెబుతారు. వీటిని నమ్మేవారిద్దరూ ఒకసారి నా యొద్దకు వచ్చారు. పాపమునుండి కడుగబడిన భూమి, అనారోగ్యం, మరణం లేని భూమి, సంతోషం చేత నింపబడిన భూమి గురించి వారు వివరించారు. "ఇది చాలా ఆసక్తికరంగా ఉందా?" అని వారు అడిగారు. "నిజానికి ఇది నిరుత్సాహకరంగా" ఉందని నేనీ జవాబిచ్చాను, "నేను *క్రొత్త* ఆకాశం *క్రొత్త* భూమి కొరకు ఎదురుచూస్తున్నాను [2 పేతురు 3:13; ప్రకటన 21:1 చూడు]. కానీ మీరు అతుకులతో బాగుచేయబడిన, తిరిగి మలచబడిన భూమి గురించి చెప్తున్నారు. క్రొత్త బట్టలకును, అతుకులు వేసిన బట్టలకు గల తేడాను చిన్న పిల్లవాడు కూడా

చెప్తాడు” అని చెప్పాను.

సాత్వికులు న్యాయపరంగా ఈ భూమిని ఇప్పుడు లేదా రాబోవు కాలంలో గాని స్వతంత్రించుకుంటారని వాక్యం చెప్పడం లేదు. “అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును. పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును. *భూమియు, దాని మీదనున్న కృత్యములును కాలిపోవును*” (2 పేతురు 3:10; నొక్కి చెప్పింది నాది) అని పేతురు వ్రాస్తున్నాడు.

### వాగ్దానపు అర్థం *ఏమిటి*

అయితే ఈ వాగ్దానపు అర్థం ఏమిటి? ఏవిధంగా సాత్వికులు భూలోకమును స్వతంత్రించుకుంటారు? ఇంతకుముందున్న వాగ్దానములను పరిశీలించినట్లుగానే, ఈ వాగ్దానం *ఆత్మీయార్థమైనది.* తాము ఎదురు చూస్తున్న మెస్సీయ్యా సైనికాధికారివలె ఈ లోకాన్ని స్వతంత్రించుకొని అందులో తాము పరిపాలన చేయుటకు తమకు అప్పగిస్తాడని ఆయన శిష్యులు భావించారు. ప్రభువు వారి ఆలోచనలను తలక్రిందులు చేస్తూ, “నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు” (యోహాను 18:36) అని ఆయన స్పష్టం చేశారు.

ఒకవేళ ఈ వాగ్దానం ఆత్మీయముగా తీసుకొనబడినాగాని, వాక్యంలో ఇవ్వబడిన “భూలోకము” ఇప్పుడుదా లేక రాబోయే రాజ్యమునకు సంబంధించినదా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఈ వాగ్దానం మనమీ లోకంలో ఉండగానే నెరవేరుతుందని కొందమంది చెప్తారు. ఈ వాగ్దానం ఈ లోకంలోని మన జీవితం గురించి కాదు. రాబోయే రాజ్యమును గురించినదని కొంతమంది వాదిస్తారు. ఈ వాగ్దానమునకు రెండు దినముల నెరవేర్పు ఉంది. మనమీ లోకములో ఉండగానే ఇది కొంతవరకు నెరవేరినా గాని రాబోయే జీవితముతో ఇది సంపూర్ణముగా నెరవేరుతుందని మరోసారి గుర్తు చేస్తున్నాను.

*ఈ జీవితంలో.* యేసు ప్రభువు మత్తయి 5:5లో చెప్పిన మాటలనే పాత నిబంధనలో దావీదు కీర్తనలో మనం చూస్తాము. “దీనులు భూమిని స్వతంత్రించుకొందురు, బహు క్షేమము కలిగి సుఖించెదరు” (కీర్తన 37:11). KJVలో మూడవ ధన్యత మరింత స్పష్టముగా ఈ వాక్యభాగమును పోలియుంటుంది. “సాత్వికులు భూమిని స్వతంత్రించుకొందురు.” కీర్తన 37 ప్రకారం, సాత్వికులు/దీనులు అనగా, దేవునియందు నమ్మికయుంచువారు (3 వచనం). మరియు కీడు చేయువారిని ఆయన శిక్షిస్తాడని ఆయనయందు ఎదురుచూచువారు (7-9 వచనాల). ఇందులో ఆసక్తికర పదం “భూమిని” [NASB] లేదా “భూలోకమును” [KJV]. కీర్తనలలో చెప్పబడిన భూమి కనాను దేశ ప్రాంతమును సూచిస్తుంది. కేవలం సాత్వికం/దీనత్వం ఉన్నవారే ఆ దేశములో నివసిస్తారని దావీదు తెలియజేస్తున్నాడు. కాబట్టి కేవలం సాత్వికులు లేదా దీనులు మాత్రమే ఈ భూలోకపు సంపూర్ణ ఆశీర్వాదాలను పూర్తిగా అనుభవించగలరు.

సాత్వికము కలిగిన క్రైస్తవులు మాత్రమే ఈ భూమి ఇచ్చే సమృద్ధికర, ఐశ్వర్యమైన తృప్తికర జీవితాన్ని పొంది ఈ భూమిని స్వతంత్రించుకుంటారు.[19] పౌలు ఈ జీవితం గురించి తెలియజేస్తూ, “ఏమియు లేనివారమైనట్లుండియూ సమస్తమును కలిగినవారము” (2 కొరింథీయులకు 6:10) అని వ్రాస్తున్నాడు. అతడు కొరింథీయులకు ఈ నిశ్చయత నిస్తున్నాడు:

> కాబట్టి ఎవడును మనుష్యులయందు అతిశయపడకూడదు. *సమస్తమును మీవే,* పౌలైనను, అపొల్లోయైనను, కేఫాయైనను, *లోకమైనను,* జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందున్నవియైనను రాబోవునవియైనను *సమస్తమును మీవే,* మీరు క్రీస్తువారు; క్రీస్తు దేవునివాడు (1 కొరింథీయులకు 3:21-23; నొక్కి చెప్పింది నాది).

"ఈ భూమియందున్న వెలగల ప్రతిదీ సాత్వికులదే! న్యాయపరంగా వారికి ఒక్క అంగుళం కూడా ఇక్కడ లేదు కానీ, ఈ భూమి యెహోవాదని వారు ఎరిగి దాని అందమును, శోభను వారు ఆనందిస్తారు."[20]

మొదటిసారి ధన్యతలను గురించి నేను ప్రచంగించడానికి ముందు ఒక్లహోమాలోని కామాంచిలోని సంఘ సభ్యుని అంత్యక్రియలకు నేను హాజరయ్యాను. అతడు జ్యువెల్ థామస్. అతడు చాలా విధేయత కల్గినవాడు. వ్యవసాయధారుడు. అతడి జ్ఞాపకార్థ కూడిక విశాలమైన స్కూలు ఆడిటోరియంలో జరిగింది. ప్రతి కుర్చీ కూడా నింపబడింది. ఇంకా అనేకమంది గోడలకు ఆనుకుని నిలువబడియున్నారు. ఆ కార్యక్రమంలో చదువబడిన వాక్యభాగములలో మత్తయి 5:5 కూడా ఒకటి: "సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" (KJV). మొదటి సారిగా ఈ వాక్యభాగం ఆశ్చర్యముగా అన్పించింది. థామస్ ధనవంతుడు కాదు. అయినా, ఈ లోకపు పూర్తి ఆశీర్వాదాన్ని అతడు పొందుకున్నాడు. ఈ లోకంలో గౌరవం సంపాదించుకున్నాడు. George MacDonald యిలా వ్రాస్తున్నాడు,

> ఈ లోకంలో కలిగియున్న వాడు ఎవడు - వెయ్యి ఇళ్ళను కలిగియున్నవాడా? లేక తనకంటూ ఏ ఇల్లూ లేకుండా పది ఇళ్ళ తలుపులు తట్టినప్పుడు తక్షణమే ఆనందంతో ఉండేవాడా? ఎవరు ధనికుడు; తన డబ్బంతటిని ఖర్చు చేసుకుని ఏ ఆశ్రయం లేనివాడా లేక ఒక వందలో తన అవసరం తీర్చుకునేవాడా?[21]

ఎంతో గొప్ప ధనం ఉన్నవాళ్ళు విచారంగా, ఆందోళనగా ఉండడం అలాగే పేదవారు ఆనందంగా ఉండడం అనేది మనం చూస్తూనే ఉంటాము. ఎంతో ధనవృద్ధి ఉన్నా లేక సమస్తం సమృద్ధిగా ఉంటే, అవి మనలను సంతోషంగా ఉంచలేవు. గానీ, జీవితం పట్ల మన వైఖరి మనలను సంతోషంగా ఉండేలా చేస్తుంది. "ఈ లోకములోని విషయాలను లెక్కచేయని వారికి, అలాగే వాటిని ఆత్మీయ విషయాలతో పోల్చి అల్పంగా భావించుకునేవారికి నిజమైన ఆశీర్వాదాలుంటాయి" అని Don Humphrey వ్రాస్తున్నాడు. సాత్వికమైన వ్యక్తి తనకున్నవాటిని బట్టి భారముగా భావించాడు అలాగే వాటిని కోల్పోతానన్న భయము కూడా అతనికుండదు.[22]

*రాబోయే జీవితములో.* సాత్వికులు ఈ భూమిని స్వతంత్రించుకొనుటను గురించి ఎంతో చెప్పవచ్చు. కానీ, రాబోయే జీవితములో ఎలా ఇది నెరవేరుతుందో తెలుసుకుందాము. ఇతరుల అన్ని ధన్యతల వలె, దీని సంపూర్ణ నెరవేర్పు పరలోకంలోనే ఉంటుంది - హెబ్రీ పత్రిక 11 అధ్యాయంలో విశ్వాస వీరులను గురించి మనమీ విషయాలను చూస్తామా,

> వీరందరు ఆ వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరమునుండి చూచి వందనముచేసి, తాము భూమిమీద పరదేశులమును, యాత్రికులమునై యున్నామని ఒప్పుకుని, విశ్వాసముగలవారై మృతినొందిరి. ... అయితే వారు మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు. అందుచేత తాను వారి దేవుడనని అనిపించుకొనుటకు దేవుడు వారినిగూర్చి సిగ్గుపడడు; ఏలయనగా ఆయన వారికొరకు ఒక

పట్టణమును సిద్ధపరచియున్నాను (13–16 వచనాలు).

రెండు అధ్యాయముల తరువాత, అదే గ్రంథకర్త “నిలువరమైన పట్టణము మనకిక్కడ లేదు గాని, ఉండబోవుచున్నదాని కోసరము ఎదురుచూచుచున్నాము” (హెబ్రీయులకు 13:14; ప్రకటన 21:2, 10).

రోమా 8లో మన ఆత్మీయ స్వాస్థ్యమును గురించి పౌలు వ్రాస్తున్నాడు. “మనము పిల్లలమైతే, వారసులము, అనగా దేవుని వారసులము. క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడినయెడల, క్రీస్తుతోడి వారసులము” (17 వచనం). ఈ లోకంలో మనకుండే ఆశీర్వాదములు శ్రమలతో కూడినవైయుంటాయి. రాబోవు కాలమును గురించి అతడు ఎదురుచూస్తున్నాడు. అందుకని, “మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను” (18 వచనం) అని వ్రాస్తున్నాడు. అతడు తన జీవిత అంతమును గూర్చి ఎరిగి, “ప్రభువు ప్రతి దుష్కార్యమునుండి నన్ను తప్పించి తన పరలోక రాజ్యమునకు చేరునట్లు నన్ను రక్షించును. యుగయుగములు ఆయనకు మహిమ కలుగును గాక, ఆమేన్ ...” (2 తిమోతి 4:18) అని వ్రాస్తున్నాడు.

మనమీ భూమిని స్వతంత్రించుకుందామనే వాగ్దాన నెరవేర్పు “*క్రొత్త* భూమి, *క్రొత్త* ఆకాశములో నెరవేరుతుంది” (ప్రకటన 21:1; నొక్కి చెప్పింది నాది; 2 పేతురు 3:13). ఇది దేవుని నివాస స్థలము. అక్కడ మనం ఏమైయుండవలెననో అలాగుండుటకు మనకు తగినంత ప్రోత్సాహం అక్కడుంది.

## ముగింపు

“సాత్వికుల ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురు” (మత్తయి 5:5). నీవు భూమిని స్వతంత్రించుకోవాలనుకొంటున్నావా – ఈ భూమి మీకు ఇస్తున్న వాటిలో శ్రేష్ఠమైనవి పొంది *మరియు* “క్రొత్త భూమి” కొరకు ఎదురుచూస్తూ స్వతంత్రించుకోవాలనుకుంటున్నారా? అయితే మీరు సాత్వికులైయుండాలి.

సాత్వికము అనేది నెమ్మదిగా మాట్లాడడం, ఇతరులతో దయగా నుండడం కంటే మరి ఇంకెంతో ఉందని గుర్తుపెట్టుకోండి. అన్ని ధన్యతలకంటే ఈ ధన్యత ఎంతో కష్టమైనదని కొందమంది భావిస్తుంటారు. ఎందుకంటే ఇందులో దేవుని చిత్తమునకు సంపూర్ణ విధేయతను కనబరచాలి. “నీవు నాకు అవసరంలేదు. నీ మార్గం నాకు అవసరంలేదు” అని గర్విష్టుడు అంటాడు, కానీ, “దేవా, నేను నా బలహీనతలను గుర్తిస్తున్నాను. నీ యెదుట నేను ఏ విలువలేనివాడనని గుర్తిస్తున్నాను. నీవు నన్ను ప్రేమించినందుకు నేను నీకు కృతజ్ఞుడను, నా కొరకు నీ కుమారుని చనిపోనిచ్చి నా రక్షణ నిమిత్తం దారిని సరాళము చేశావు. నేను నీ చిత్తానికి సంపూర్ణముగా విధేయుడిని” అని సాత్వికుడు అంటాడు. మీరింకను దేవుని కుమారులుగా లేనట్టయితే, లేక మీరు అవిశ్వాసముతో కూడిన బిడ్డలైతే, ఈ రోజే ఆయన యొద్దకు వచ్చి మీ విధేయతను చూపించండి.

సూచనలు

[1]“సాత్వికమునకు” గ్రీకు పదాన్ని NASB సాధుత్వముగా “gentle/meek” అనువదిస్తుంది. ఒక్కోసారి సాత్వికమనే

ఇస్తుంది (2 కొరింథీయులకు 10:1). [2]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph H. Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 534. [3]Adapted from Geoffrey W. Bromiley, *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel and Gerhard Friedrich; trans. Geoffrey W. Bromiley, abr. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 930. [4]Hugo McCord, *Happiness Guaranteed* (Murfreesboro, Tenn.: Dehoff Publications, 1956), 23. [5]"జెంటిల్మెన్" అని అన్నప్పుడు క్రైస్తవ జెంటిల్మెన్ Hugo McCord నాకు గుర్తుకు వస్తాడు. [6]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 401. [7]McCord, 23-24. [8]Vine, 401 (emphasis mine). [9]Bromiley, 930. [10]A similar explanation is given in William Barclay, *The Gospel of Matthew,* vol. 1, The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1958), 91-92.

[11]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount,* vol. 1 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 67. [12]ఇంకా రచయితలు పేర్కొన్న ఉదాహరణలు. యిర్మీయా, దావీదు, పేతురు, స్తెఫను మరియు పౌలు. [13]సాత్వికులను గురించి అనేక ప్రసంగాలలో మోషే. క్రీస్తు, ఇంకా అనేక ఉదాహరణలు కనబడతాయి. దీనిని మీరింకను విస్తరింపవచ్చును. [14]మోషే ఐగుప్తీయుడిని చంపాడు, మొదటి పది ఆజ్ఞల పలకలను పగుల కొట్టాడు, బండతో మాట్లాడమంటే కొట్టాడు. [15]సంఖ్యాకాండము 12:1లో మొదటిగా మిర్యాము పేరు ఇవ్వబడింది. అహరోను దానిని అనుసరించాడు. [16]ప్రాచీన ప్రతులలో ఈ వాక్యభాగం కనబడదు. అందుకని NASB అనువాదకులు దీనిని బ్రాకెట్లలో ఉంచారు. ఈ సంఘటన జరిగేయుంటుందని ఎక్కువమంది అంగీకరిస్తారు. [17]సమయం తీసుకుని ఈ కథను వివరింపవచ్చు. [18]McCord, 26. [19]Joe Schubert, "The Meek," *Resources* 2 (1981): 13. [20]James M. Tolle, *The Beatitudes* (Fullerton, Calif.: Tolle Publications, 1966), 42.

[21]Quoted in Tolle, 43. [22]Adapted from Don Humphrey, *The Beatitudes* (Burlington, Mass.: Eternity Press, 1969), 31.